## క్లుప్తంగా

### ఎస్సీ, ఎస్టీలకు సీపెట్‌లో ఉచిత శిక్షణ

**నల్లజర్ల:** విజయవాడలో ఉన్న భారత ప్రభుత్వ సంస్థ సీపెట్‌లో నేషనల్ ఎస్సీ, ఎస్టీ హబ్ స్కీం ద్వారా ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువత 30 మందికి ఉపాధి కల్పనతో పాటు, ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు సంస్థ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్‌బాబు తెలిపారు. మెషీన్ ఆపరేటర్స్, ప్లాస్టిక్ ప్రాసెసింగ్‌లో ఐదు నెలల పాటు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌తో పాటు, అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, హోసూర్, చెన్నై ప్రాంతాల్లోని ప్రముఖ ప్లాస్టిక్, అనుబంధ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలు అందిస్తున్నట్టు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత, కనీస వయసు 18 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులు సీపెట్ ప్రతినిధి కె.సుందర్రావు, 93980 50255ను సంప్రదించాలన్నారు.

### 58 కావిళ్లతో ముత్యాలమ్మ తల్లికి సారె


శాకంబరి అలంకరణలో ముత్యాలమ్మ అమ్మవారు

**నల్లజర్ల:** ఆవపాడులో గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారికి భక్తులు గురువారం ఆషాఢ సారె సమర్పించారు. అమ్మవారిని శాకంబరిగా అలంకరించి, 58 కావిళ్లతో వివిధ రకాల పిండి వంటలు, అరటి పండ్లు, పుసుపు, కుంకుమలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామమంతా భక్తులతో కిటకిటలాడింది. ఆలయం వద్ద గీతాపారాయణం చేశారు. అనంతరం అన్న సమారాధన జరిగింది.

### రికార్డు స్థాయిలో వర్షం

**కొవ్వూరు:** డివిజన్ వ్యాప్తంగా వర్షం దంచికొట్టింది. గురువారం ఉదయం 8.30 సమయానికి డివిజన్‌లో ఈ సీజన్‌లోనే గరిష్ట స్థాయిలో వర్షపాతం నమోదైంది. దేవరపల్లి, నిడదవోలు, చాగల్లు, తాళ్లపూడి, నల్లజర్ల, పెరవలి, కొవ్వూరు, ఉండ్రాజవరం, గోపాలపురం మండలాల్లో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. దేవరపల్లిలో జిల్లాలోనే గరిష్టంగా 124.8 మి.మీ., నిడదవోలులో 117.4, చాగల్లులో 92.4, తాళ్లపూడిలో 78.2, గోపాలపురంలో 77.2, ఉండ్రాజవరంలో 73.4, నల్లజర్లలో 69.2, పెరవలిలో 65.6, కొవ్వూరులో 65.4 మి.మీ. వర్షం కురిసింది.

### బియ్యం, కందిపప్పు స్టాల్ ప్రారంభం

**ఉండ్రాజవరం:** పౌర సరాఫరాల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఉండ్రాజవరం ఆర్యవైశ్య సత్రంలో కందిపప్పు, బియ్యం చౌక ధరలో అందించే స్టాల్స్‌ను మంత్రి కందుల దుర్గేష్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో గోస్తనీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఈర్పిన సత్యనారాయణ, తహసీల్దార్ కె.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### బాలికలకు అవగాహన

**నిడదవోలు రూరల్:** బాలికల ఉన్నత విద్య ఇంటికి వెలుగునిస్తుందని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ పి.నళిని అన్నారు. సమిశ్రగూడెం అంగన్‌వాడీ కేంద్రాల్లో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా గురువారం బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

### మదన్ మోహన్‌పై సుమోటోగా కేసు నమోదు చేయాలి

**నిడదవోలు:** దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్న, గిరిజన మహిళ ఆత్మగౌరవం దెబ్బ తినేలా వ్యవహరిస్తున్న మదన్ మోహన్‌పై సుమోటోగా కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆమె భర్తనని చెప్పుకుంటున్న మదన్ మోహన్ తన భార్యకు పుట్టిన బిడ్డకు తండ్రి ఎవరో తెలపాలంటూ దేవదాయ కమిషనర్‌కు లేఖ రాయటం తీవ్ర అభ్యంతరకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె బాధ్యత కలిగిన స్థానంలో ఉన్న అధికారి అని, గిరిజన మహిళ అని, ఆమె అభిప్రాయం అడగకుండా కొన్ని పత్రికలు, చానల్స్‌లో ఆమె ఆత్మ గౌరవానికి భంగం కలిగేలా చర్చలు నిర్వహించడం తగదని అన్నారు. దేవదాయ శాఖ అధికారిగా ఆమె అవినీతికి పాల్పడితే చట్టపరంగా విచారణ చేసి, చర్యలు తీసుకోవాలే తప్ప ఇలాంటి చౌకబారు ప్రచారంతో మహిళల ఆత్మగౌరవం దెబ్బ తినేలా వ్యవహరించటం తగదని రాంబాబు పేర్కొన్నారు.

### స్కూలు బస్సుకు తప్పిన ముప్పు!

**నల్లజర్ల:** తాడేపల్లిగూడెం నుంచి పుల్లలపాడు వస్తున్న నారాయణ విద్యా సంస్థల బస్సుకు ముప్పు తప్పింది. పుల్లలపాడు వద్దకు చేరుకునే సరికి టైర్లలో గాలి తగ్గడంతో పక్కకు ఒరిగిపోయింది. ఆ సమయంలో గ్రామంలో దిగాల్సిన విద్యార్థులు 10 మంది బస్సులో ఉన్నారు. వీరు బస్సు మరోవైపు నుంచి దిగి క్షేమంగా ఇంటికి వెళ్లిపోయారు. గతేడాది వర్షాలకు ఊరచెరువు గట్టు తెగిపోయింది. ఇటీవల దానికి తాత్కాలిక మరమ్మతులు చేశారు. గురువారం రాత్రి విద్యార్థులను వారి గమ్యస్థానాల్లో దించడానికి వచ్చిన బస్సు కాట్రగడ్డ ప్రభాకరావు పామాయిల్ తోట వద్ద ముందు చక్రం పక్కనున్న గోతిలోకి దిగి, పక్కకు ఒరిగిపోయింది. దీనిని గమనించిన సమీపంలోని వారు వచ్చి విద్యార్థులను బయటకు తెచ్చి, వారి ఇళ్లకు పంపారు. అనంతరం జేసీబీ సాయంతో బస్సును బయటకు లాగారు.


దేవరపల్లి సెంటర్‌లో నీట మునిగిన ఇళ్లు


దేవరపల్లిలో జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న ముంపు నీటిని పరిశీలిస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత


సంగాయగూడెంలో ముంపు ప్రాంతంలో పర్యటిస్తున్న తహసీల్దార్ ఆచారి, రెవెన్యూ సిబ్బంది


దేవరపల్లిలోని డిగ్రీ, పీజీ కళాశాలలో చేరిన ముంపు నీరు

# జల దిగ్బంధం

- ముంపులో చిక్కుకున్న గ్రామాలు
- జాతీయ రహదారిపై వరద నీరు
- నిలిచిపోయిన వాహనాలు
- ఇళ్లు, దుకాణాల్లో చేరిన వర్షపు నీరు
- నీట మునిగిన పొలాలు
- దేవరపల్లి ముంపు ప్రాంతాల్లో మాజీ మంత్రి తానేటి వనిత పర్యటన
- వాగుపై ఆక్రమణలు తొలగించాలని బాధితుల వినతి

**దేవరపల్లి:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మెట్ట ప్రాంతంలో గురువారం కుండపోత వర్షం కురిసింది. ఉదయం ఐదు గంటల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు, పొలాలు, రహదారులు జలమయమయ్యాయి. పలు గ్రామాల్లో జనావాసాలు నీట మునిగాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు కుండపోత వర్షం కురిసింది. అనేక గ్రామాలు జల దిగ్బంధంలో ఉన్నాయి. దేవరపల్లి మండలంలో సంగాయగూడెం, బందపురం, త్యాజంపూడి, దేవరపల్లి గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో ఉన్న గృహాల్లో వర్షపు నీరు చేరింది. దేవరపల్లి-గుండుగొలను జాతీయ రహదారిపై స్థానిక మూడు రోడ్ల కూడలి ప్రాంతంలో రోడ్డుపై సుమారు 4 అడుగుల ఎత్తున వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎస్‌బీఐ, దుకాణాల్లోకి ముంపు నీరు ప్రవేశించింది. దీంతో దుకాణదారులు తీవ్రంగా నష్టపోయారు. యూనియన్ బ్యాంకు వెనుక వీధిలో సుమారు ఆరు అడుగుల ఎత్తున నీరు ప్రవహించింది. దాదాపు 50 గృహాలు నీట మునిగాయి. అంబేడ్కర్ సెంటర్ రోడ్డు, శ్మశానం రోడ్డు పూర్తిగా జలమయమయ్యాయి. బందపురంలో పంచాయతీ కార్యాలయం రోడ్డుపై వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. సమీపంలోని గృహాల్లోకి నీరు చేరింది. సంగాయగూడెంలోని పల్లపు ప్రాంతం పూర్తిగా జలమయం కావడంతో, ఎస్సీ ప్రాంతంలో పలు గృహాల్లో నీరు చేరింది. ముంపు ప్రాంతంలో తహసీల్దార్ వైవీ ఆచారి, సర్పంచ్ కరుటూరి ఉషారాణి, రెవెన్యూ సిబ్బందితో పర్యటించారు. గౌరీపట్నం, యర్నగూడెం. త్యాజంపూడి, దుద్దుకూరు, సూర్యనారాయణపురం, గ్రామాల్లో వేలాది ఎకరాల్లోని వరి చేలు నీట మునిగాయి. కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి.

#### పొంగిన వాగులు, చెరువులు

వరద నీటి ప్రవాహానికి మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దేవరపల్లిలో ఇసుకవాగు, యాదవోలులోని మొండి వాగు, బందపురంలోని చిన్నకాలువ, సంగాయగూడెంలోని పాలేటి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. త్యాజంపూడిలోని ఆవ చెరువు, యర్నగూడెంలోని గండి చెరువు, సంగాయగూడెంలోని పానకాల చెరువు, దేవరపల్లిలోని ఊర చెరువు ఉధృతమయ్యాయి. దేవరపల్లి-పల్లంట్ల రోడ్డులో పోలవరం కుడి కాలువ వంతెనపై వర్షం నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.


మార్కొండపాడులో నీట మునిగిన వరినాట్లను చూపిస్తున్న రైతు

#### మాజీ మంత్రి తానేటి వనిత పరిశీలన

దేవరపల్లిలో ముంపునకు గురైన ప్రాంతాల్లో మాజీ మంత్రి తానేటి వనిత పర్యటించారు. మూడు రోడ్ల కూడలి ప్రాంతంలో జాతీయ రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించారు. వరద నీరు చేరిన దుకాణాలను సందర్శించారు. వాగును ఆక్రమించి కొన్ని దుకాణాలు కట్టడం వల్ల వర్షాకాలంలో నీటి ప్రవాహం ముందుకు వెళ్లలేక దుకాణాల్లో చేరుతుందని దుకాణదారులు తెలిపారు. ఆక్రమణలు తొలగించేలా కృషి చేయాలని బాధితులు మాజీ మంత్రి తానేటి వనితను కోరారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, పార్టీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, పలువురు పార్టీ నేతలు ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. పలువురు జనసేన, టీడీపీ నాయకులు ముంపు ప్రాంతంలో పర్యటించారు. పంచాయతీ అధికారులు జేసీబీల సాయంతో వరద ప్రవాహానికి అడ్డంకులను తొలగించే చర్యలు చేపట్టారు.

# స్తంభించిన జన జీవనం

- నీట మునిగిన ఆర్టీసీ బస్టాండ్
- ప్రయాణికుల ఇబ్బందులు
- పల్లపు ప్రాంతాలు జలమయం

**నిడదవోలు:** అల్పపీడనం ప్రభావంతో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కుండపోత వర్షం కురిసింది. నిడదవోలు పరిసర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి జన జీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పట్టణంలో పుట్‌పాత్, తోపుడు బండ్ల, చిరు వ్యాపారాలు ఇబ్బందులు పడ్డారు. రోజువారి కూలీలు పనులకు వెళ్లలేకపోయారు. పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ పూర్తిగా నీట మునిగింది. ఆర్టీసీ గ్యారేజీలోకి వర్షపు నీరు ప్రవేశించింది. దీంతో ప్రయాణికులు మోకాలు లోతు నీళ్లలోంచి నడిచి వెళ్లాల్సి వచ్చింది. ఉద్యోగులు, విద్యార్థులు బస్టాండ్ వద్ద నానా అవస్థలు పడ్డారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న మేజర్ డ్రైన్‌లో పూడికతీత చేపట్టకపోవడంతో మురుగు, వర్షపు నీరు పారక, చిన్నపాటి వర్షానికి బస్టాండ్ నీట మునుగుతోంది. కుండపోత వర్షానికి పట్టణంలో ప్రధాన రహదారులన్నీ నీట మునిగాయి. చినకాశిరేవు రోడ్డు నుంచి గాంధీబొమ్మ సెంటర్ రోడ్డు, సంత మార్కెట్ నుంచి బస్టాండ్ వరకు, గణపతి సెంటర్ల రహదారులు జలమయం అయ్యాయి. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా తయారవడంతో, వర్షపు నీరు రోడ్లను ముంచెత్తుతున్నాయి. పట్టణంలోని ఇందిరానగర్, రాయిపేట, సుబ్బరాజుపేట, ఎంవీ నగర్, లింగంపల్లి, అన్నపూర్ణనగర్, ఎస్టీ కాలనీలో పల్లపు ప్రాంతాలు నీట మునగడంతో ప్రజలు అవస్థలు పడ్డారు.

#### ముంపు బారిన వరి చేలు

**తాళ్లపూడి:** కుండపోత వర్షంతో వివిధ ప్రాంతాల్లోని రోడ్లపై, జనావాసాల వద్ద ముంపు నీరు నిలిచిపోయింది. తాళ్లపూడి మండలంలో గురువారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పలు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. జన జీవనం పూర్తిగా స్తంభించింది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. తిరుగుడుమెట్ట, తాళ్లపూడి, పెద్దేవం గ్రామాల్లోని వరి చేలు ముంపు బారిన పడ్డాయి. తాళ్లపూడి ఎస్సీ ఏరియాలో, పక్కిలంక రోడ్డు, వేగేశ్వరపురంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాల్లో రోడ్లు ఛిద్రమయ్యాయి. డ్రైనేజీలు లేక నీరు ప్రవహించడం లేదు. వర్షం కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.


నిడదవోలులో నీట మునిగిన ప్రధాన రహదారులు


నిడదవోలు పట్టణంలోని ఆర్టీసీ గ్యారేజీలోకి చేరిన వర్షపు నీరు


వేగేశ్వరపురంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

### ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

#### పరివాహక ప్రాంతాల ప్రజల్లో ఆందోళన

**నిడదవోలు రూరల్:** గోదావరికి వరద ఉధృతి పెరగడంతో నిడదవోలు మండలంలోని పరివాహక గ్రామాలైన పెండ్యాల, జీడిగుంట, రావివారిపాలెం గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. విజ్జేశ్వరం, ధవళేశ్వరం నుంచి సముద్రంలోకి గురువారం భారీగా వరద నీరు విడుదల చేయడంతో, పెండ్యాల గ్రామంలో గట్టు సమీపంలోని సుమారు 500 ఎకరాల పొలాలు నీటమునిగాయి. పెండ్యాల పుష్కర ప్రధాన స్నానఘట్టం, కూర్చొనే బల్లలు, విద్యుత్ స్తంభాలు జలమయమయ్యాయి. ఇప్పటికే అరటి, బెండ తోటల్లోకి వరదనీరు చేరడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దిగువ ప్రాంతాల్లో గోదావరి మరింత పెరిగే అవకాశాలున్నాయి. క్రమంగా పెరుగుతున్న గోదావరిని పరిసర ప్రాంతాల ప్రజలు తిలకిస్తున్నారు. మరోవైపు ఎర్ర కాలువ ఉధృతంగా ప్రవహించడంతో, కంసాలిపాలెం-మాధవరం వంతెనపై రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు వంతెనపై వెళ్లకుండా పోలీసులు నిషేధించారు. భారీ వర్షాలతో పలు గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. సమిశ్రగూడెం, డి.ముప్పవరం, కలవచర్ల గ్రామాల్లోని వరి పొలాలు నీటమునగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ముంపులో 425 ఎకరాల వరి చేలు

**చాగల్లు:** మండలంలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వివిధ గ్రామాల్లో పొలాలు నీట మునిగాయి. గురువారం కుండపోతతో జనజీవనం స్తంభించింది . ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు నీరు రావడంతో ఊనగట్ల, మార్కొండపాడు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఊనగట్ల-చిక్కాల రోడ్డు నీట మునిగింది. మీనానగరంలో చెరువు గట్టు తెగడంతో పొలాల్లో నీరు చేరింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. నిడదవోలు-పంగిడి ఆర్అండ్‌బీ రోడ్డుపై ఊనగట్ల వద్ద నీరు ప్రవహిస్తోంది. కలవలపల్లిలో నాప చెరువు, బ్రాహ్మణగూడెం రావులచెరువు, ఊనగట్ల పాపయ్యచెరువు, ఊర చెరువు పొంగి ప్రవహిస్తున్నాయి. చాగల్లులోని పేముల కాలువ వరద ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. మండలంలో 425 ఎకరాల్లో వరిచేలు నీట మునిగినట్టు ప్రాథమిక అంచనా వేశామని ఏఓ కె.వేణుగోపాల్ తెలిపారు. బ్రాహ్మణగూడెం, నందిగంపాడు, మార్కొండపాడు, ఊనగట్ల, ఎస్.ముప్పవరం, చాగల్లు, దారవరం, చంద్రవరం తదితర పల్లపు ప్రాంతాల్లోని పొలాలు నీట మునిగాయి. కొన్నిచోట్ల పొలాలు చెరువులను తలపిస్తున్నాయి.

#### రైతుల్లో ఆందోళన

**పెరవలి:** ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్టుగా బుధవారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షాలకు వరిచేలు నీటమునిగాయి, అరటి, కంద, కూరగాయల పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు మరో మూడు రోజుల పాటు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేయటంతో నారు కుళ్లిపోతుందని రైతుల్లో ఆందోళన నెలకొంది. కానూరు బాడవా మొత్తం మునిగిపోవటంతో నారు కుళ్లిపోవటంతో మరలా కొత్తనారు తెచ్చి నాట్లు వేయాలని రైతులు అంటున్నారు. ఇక్కడ నీరు లాగాలంటే కనీసం వారం పడుతుందని చెబుతున్నారు. ఉసులుమర్రు, కానూరు అగ్రహారం, నడుపల్లి, తీపర్రు, కాపవరం గ్రామాల్లో వరిచేలు నీట మునిగాయి.

#### జన జీవనం అస్తవ్యస్థం

**ఉండ్రాజవరం:** అల్ప పీడన ప్రభావంతో గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్థమైంది. రోడ్లపై నీరు చేరడంతో రాకపోకలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. పలు గ్రామాల్లో వరినాట్లు ముంపు బారిన పడడంతో, నీటిని తొలగించడానికి రైతులు అవస్థలు పడుతున్నారు.

#### ముంపు ప్రాంతాల్లో మంత్రి దుర్గేష్ పర్యటన

**నిడదవోలు :** పట్టణంలో ముంపు సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపేలా కార్యాచరణ చేపట్టాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక నాయకులు, అధికారులతో కలిసి మంత్రి పట్టణంలో ముంపునకు గురైన ఆర్టీసీ బస్టాండ్, క్రైస్తవ శ్మశాన వాటిక, గణపతి సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో బస్టాండ్, గణపతి సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్లలో ముంపునకు ప్రధాన కారణాలను అన్వేషించి, తగు చర్యలు తీసుకునేలా మున్సిపల్ అధికారులను ఆదేశించామన్నారు. డ్రైనేజీ వ్యవస్థను సరిగ్గా పట్టించుకోకపోవడంతో ఆయా ప్రాంతాలన్నీ ముంపునకు గురవుతున్నాయని చెప్పారు. మురుగు నీరు వేగంగా పారేలా డ్రైనేజీ వ్యవస్థను పటిష్ట పర్చాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై మున్సిపల్, ఆరోగ్య శాఖాధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. విష జ్వరాలు ప్రబలకుండా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణంలో డ్రైన్, ఇతర పనులకు రూ.3 కోట్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, డీఈఈ మాధవి, ఏఈ హేమంత్ తదితరులు ఉన్నారు.


మోర్త వద్ద వర్షపు నీటిని తొలగిస్తున్న స్థానికులు

### రాజమహేంద్రవరంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ



ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

**ఉండ్రాజవరం:** రాజమహేంద్రవరంలో ఈ నెల 20, 21 తేదీల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు జరుగుతాయని సంఘ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్ తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాల వద్ద ఈ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థుల సమస్యలపై చర్చిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే విధానాలు, ప్రభుత్వ విద్యా సంస్థలను మూసి వేయడం వంటి చర్యలను తక్షణం మానుకోవాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు నిర్మిస్తామన్నారు. అనంతరం సంఘ ఉండ్రాజవరం మండల నూతన కమిటీని నియమించారు. మండల అధ్యక్షుడిగా ఎ.ఆశోక్, కార్యదర్శిగా ఎస్.కార్తీక్ ఎన్నికయ్యారు.


నీట మునిగిన నిడదవోలు ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్


దేవరపల్లిలో ఇసుక వాగుపై నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న గోడను తొలగిస్తున్న గ్రామస్తులు


ముక్కామలలో ముంపు నీటిలో అరటి తోట


ఖండవల్లిలో నీట మునిగిన దొండ పాదులు


# హెల్మెట్ లేని ప్రయాణం శిక్షార్హం


ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు

**కొవ్వూరు:** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కొవ్వూరు మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. హెల్మెట్ లేని ప్రయాణం శిక్షార్హమన్నారు. ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బీటీఎస్ దేవి, మేజిస్ట్రేట్ జి.సాయికృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాగంటి చలపతిరావు, ప్రతినిధులు బాబు, ఏదాటి ప్రకాశరావు, పలువురు న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

#### వాహనదారులు హెల్మెట్ ధరించాలి

**నిడదవోలు:** వాహనాలను నడిపేటప్పుడు హెల్మెట్ తప్పకుండా ధరించాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ అన్నారు. పట్టణంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో గురువారం రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రయోజనాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండరామమూర్తి, కోర్టు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి రామకృష్ణ

# ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

**దేవరపల్లి:** వరద ముంపు సమస్యలకు దేవరపల్లిలో శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అధికారులను ఆదేశించారు. దేవరపల్లిలో ముంపునకు గురైన ప్రాంతాల్లో గురువారం సాయంత్రం ఆయన పర్యటించారు. ఇసుక వాగు నుంచి ఊరచెరువు వరకు డ్రైనేజీని కొందరు ఆక్రమించడం వల్ల ముంపు సమస్య తలెత్తుతోందని పలువురు ఎమ్మెల్యేకు వివరించారు. ఆక్రమణలను తొలగించి, డ్రైనేజీల్లోని పూడిక తీయించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ, నోటీసులిచ్చి ఆక్రమణలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. అవసమైన చోట్ల కల్వర్టులకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఎన్.రవికిషోర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏఈ కృష్ణారావును ఆదేశించారు. ఆయన వెంట, తహసీల్దార్ వైవీ చారి, పలువురు నాయకులు ఉన్నారు.

#### 1500 ఎకరాల్లో పంట మునక

**గోపాలపురం:** భారీ వర్షాలకు గోపాలపురంలోని లోతట్టు ప్రాంతాలైన ఉప్పరగూడెం, రజకపేట, పంచాయతీ వీధులు జలమయమయ్యాయి. సాగిపాడు, కరగపాడు గ్రామాల మధ్య ఉన్న అల్లికాలువ ఉధృతికి రాకపోకలు స్తంభించాయి. చిట్యాల, వెంకటాయపాలెం, చెరుకుమిల్లి గ్రామాల్లోని 1500 ఎకరాల వరిపంట నీటమునిగినట్టు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.


దేవరపల్లిలో జాతీయ రహదారిపై వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

#### ఉధృతంగా ఎర్ర కాలువ

**నల్లజర్ల:** ఎర్ర కాలువ ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు దిగువ ఎర్రకాలువ నీటిమట్టం పెరుగుతోంది. గురువారం ఉదయం అనంతపల్లి హైడ్రాలజీ ప్రాజెక్ట్ వద్ద ఒక మీటరు ఉన్న నీటి మట్టం సాయంత్రానికి 1.80, రాత్రి 8 గంటలకు 2 మీటర్లకు చేరింది. ఇది అర్ధరాత్రికి మరింత పెరిగే అవకాశం ఉందని కొంగువారిగూడెం జలాశయం ఇన్‌చార్జి, నీటి పారుదల శాఖ డీఈ భాస్కరరావు తెలిపారు. జలాశయం ఉదయం 81.50 ఉండగా, సాయంత్రానికి 82 అడుగులకు చేరింది. జల్లేరు, పులివాగు తదితర వాగులు పొంగుతున్నాయి. రెండు గేట్ల ద్వారా గంటకు 3 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దీంతో నబీపేట, అనంతపల్లి, చోడవరం, గుండేపల్లి గ్రామాల్లోకి వరద నీరు చేరే అవకాశం ఉంది. తెలికిచెర్లలో తాడిపూడి కాలువకు స్వల్పంగా గండి పడటంతో స్థానికులు జేసీబీతో అడ్డుకట్ట వేశారు.


గోపాలపురం మండలం చిట్యాలలో ముంపులో ఉన్న వరిచేలు